



కారుణ్య పత్రాలు అందుకున్న యువకులతో జీఎం మనోహర్, అధికారులు

## కష్టపడి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలి

మందమర్రి, అక్టోబర్ 16 : సింగరేణి సంస్థలో నూతనంగా ఉద్యోగం పొందిన వారు కష్టపడి పనిచేసి, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ సూచించారు. ఏరియాలోని మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కింద ఉద్యోగం పొందిన 15 మందికి సోమవారం జీఎం కార్యాలయ ఆవరణలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో ఇప్పటి వరకు కారుణ్య నియామకాల ద్వారా 1,647 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పనిస్థలాలు, సమయాలు భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. విధులకు గైర్హాజరైతే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి తమతో పాటు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సీనియర్ పర్సనల్ మేనేజర్ సత్యబోస్, ఓఎస్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జోనల్‌స్థాయి క్రీడలు

చెన్నూర్, అక్టోబర్ 16 : చెన్నూర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల (బాలికల) పాఠశాలలో నిర్వహించిన కాళేశ్వరం జోనల్ స్థాయి పోటీలు సోమవారంతో ముగిశాయి. కాళేశ్వరం జోన్ పరిధిలోని 15 పాఠశాల నుంచి 1,275 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరికి అండర్-14, 17, 19 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలతో పాటు ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. మూడు రోజులు పాటు సాగిన ఈ పోటీల్లో విజేతలకు మెడల్స్ బహూకరించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు, ఉపాధ్యాయులకు భోజన, వసతి సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్ స్వరూపారాణి, చెన్నూర్ పాఠశాల ప్రిన్సిపాల్ బీ రాజమణి, జోనల్ పరిధిలోని పాఠశాలల ప్రిన్సిపాళ్లు బీఎం సువర్ణలత, బీ ప్రేమారాణి, జీ సంగీత పాల్గొన్నారు.

## చిన్నారి చికిత్సకు ఆర్థిక చేయూత

మందమర్రి, అక్టోబర్ 16 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన బైరి రాజ్యలక్ష్మి-చంద్రశేఖర్ దంపతుల ఐదు నెలల కొడుకు అజయ్ అనారోగ్యంతో బాధపడుతుండగా, మేము సైతం సభ్యులు ఆర్థిక చేయూతనందించారు. అనారోగ్యానికి గురైన బాబును దవాఖానలో చేర్పించారు. ఊపరితిత్తుల సంబంధిత వ్యాధి ఉన్నదని వైద్యులు నిర్ధారించారు. మెరుగైన చికిత్స కోసం డబ్బు లేక ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మేము సైతం సభ్యులు సోషల్ మీడియా ద్వారా దాతల సహకారంతో విరాళాలను సేకరించారు. రూ.20 వేలు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్, సభ్యులు ఈర్లపాటి సోమయ్య, గోలి సత్యనారాయణ, సాయికృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

లక్షెట్టిపేట రూరల్, అక్టోబర్ 16 : మండలంలోని వెంకట్రావుపేట రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని లక్షెట్టిపేట ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన చింతల్‌వారు దత్త(36) కూరగాయలతో ఆటోలో మంచిర్యాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో లక్షెట్టిపేట నుంచి దండేపల్లి వైపు బైక్‌పై వెళ్తున్న బాలకృష్ణ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. దీంతో దత్త అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డైరవర్ షేక్ అల్లా బకాస్‌కు గాయాలయ్యాయి. దత్త తమ్ముడు డిగంబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పూల పండుగకు బంతి సిద్ధం

- కోటపల్లి మండలంలో పెద్ద ఎత్తున సాగు
- కిలోకు రూ.100 నుంచి రూ. 150 పలుకుతున్న ధర
- కొనుగోలుకు వ్యాపారులు, స్థానిక మహిళల ఆసక్తి

**బతుకమ్మ వేడుకలకు చేతికొచ్చిన పూలు**



షట్‌పల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న బంతితోట

కోటపల్లి, అక్టోబర్ 12 : బంతిపూలకు భలే గిరాకీ ఏర్పడింది. బతుకమ్మ పండుగ సందర్భంగా ఈ పూలకు డిమాండ్ ఉండడంతో, ఈ సంవత్సరం రైతులు సాగుపై దృష్టి పెట్టారు. కోటపల్లి మండలంలోని షట్‌పల్లి, బావనపల్లి, కొండంపేట గ్రామాల్లో రైతులు పెద్ద ఎత్తున బంతిపూల పంటను వేశారు.

### పూల పండుగకు రెడీ..

గతంలో బతుకమ్మ పండుగకి పూలు కావాలంటే చెన్నూర్, మంచిర్యాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో స్థానికంగా బంతి పూలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది రైతులు వారికి ఉన్న భూముల్లో కొంత భాగం పూలసాగుకు కేటాయించారు. షట్‌పల్లి, బావనపల్లి, కొండంపేట గ్రామాలకు చెందిన రైతులు సుమారుగా 15 ఎకరాల విస్తీర్ణంలో బంతిపూలను సాగు చేశారు. రెండు రకాల బంతిపూలను రైతులు సాగు చేస్తుండగా, ధర కిలో రూ.100 నుంచి రూ. 150 వరకు పలుకుతున్నది. శనివారం ఎంగిలి పూల బతుకమ్మ ప్రారంభం కాగా, ఆఖరి రోజు సద్దుల బతుకమ్మ వరకు పెద్ద ఎత్తున కొనుగోళ్లు ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### పూల సాగుతో సరికొత్త ఒరవడి..

షట్‌పల్లి, కొండంపేట, బావనపల్లి గ్రామాలకు చెందిన రైతులు గతంలో పత్తి, వరి పంటల సాగుకే పరిమితం కాగా, ఐదేళ్ల నుంచి పూలసాగును ప్రారంభించి సరికొత్త ఒరవడిని సృష్టించారు. బంతి పూలకు బతుకమ్మ పండుగ సందర్భంగా మంచి డిమాండ్ ఉండడాన్ని గుర్తించి, ఈ పూలతోటపై దృష్టి పెట్టారు. జూలై నెలలో బంతి నారు పెడితే బతుకమ్మ పండగ వరకు పూలు చేతికి వస్తున్నాయి. సద్దుల బతుకమ్మలోగా పూలను కోసి చుట్టు పక్కల గ్రామాలకు విక్రయించనున్నట్లు రైతులు చెబుతున్నారు.

### ❖ బంతి పూలకు డిమాండ్ ఉంది..



*బతుకమ్మ పండుగ సందర్భంగా బంతిపూలకు డిమాండ్ ఉంది. ఐదేళ్ల నుంచి ఈ బంతి పూలను సాగు చేస్తున్న. పంటపై పూర్తిగా అవగాహన వచ్చింది. పూలసాగు కష్టమయినప్పటికీ బతుకమ్మ పండుగకు మంచి డిమాండ్ ఉంటది. మార్కెట్ ధర ఆదారంగానే పూలు అమ్ముతున్నం. బంతి పూల సాగుతో నాకు ఒక ప్రత్యేక గుర్తింపు లభించింది.*

**- తోడె మహేశ్వర్ రెడ్డి, షట్‌పల్లి**



విరగబూసిన బంతిపూలు

### ❖ సద్దుల బతుకమ్మకు గిరాకీ..



*బతుకమ్మ పండుగ సందర్భంగా ఏటా బంతిపూలకు డిమాండ్ ఉంటున్నది. మేము ఈ ఏడాది బంతి పూల తోట పెట్టాం. పూలు కొనేందుకు చుట్ట పక్కల గ్రామాల ప్రజలు మా ఊరికి వస్తున్నారు. కొంత మంది హోల్‌సేల్ వ్యాపారులు ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ పూలను కొనుగోలు చేస్తున్నారు. బతుకమ్మ, దీపావళికి బతుకమ్మ పూల గిరాకీ ఉంటుంది. కిలో రూ.100 నుంచి రూ. 150 వరకు విక్రయిస్తున్నం.*

**- చల్ల బాపు రెడ్డి, బావనపల్లి**

### ❖ ఈ ఏడాదే ఫస్ట్..



*బంతి పూల సాగుతో మా ఊరికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. నేను ఈ ఏడాదే మొదలు పెట్టిన. మొదటి సంవత్సరమే మంచి దిగుబడి వచ్చింది. పండగకు పూల డిమాండ్ మస్తు ఉంటది. కొన్ని పూలను ఇక్కడ అమ్మడంతో పాటు మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్‌లతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు తీసుకెళ్లి అమ్మాలని అనుకుంటున్న. ఇక తెంపే ప్రయత్నం మొదలు పెట్టిన.*

**- మేడి శ్రీనివాస్, షట్‌పల్లి**

### ❖ ఆదర్శంగా ఉండాలి..



*పంటల సాగులో పలువురికి ఆదర్శంగా ఉండాలనే నాలుగేళ్ల నుంచి బంతి పూల సాగుపై దృష్టి పెట్టిన. బతుకమ్మ పండగ సమయంలో పూలతో మంచి ఆదాయం వస్తుంది. అందుకే ఈ పంటను సాగు చేసిన. పండుగలకు పూలు అందివ్వడంతో పాటు ఉపాధి లభిస్తుండడం వల్ల సాగుపై దృష్టి పెట్టాను. మా ఊరితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఈ పూలు అమ్ముత. బంతిపూలకు బతుకమ్మ పండుగతో పాటు దీపావళికి కూడా గిరాకీ ఉంటుంది.*

**- బాపురెడ్డి, కొండంపేట**

## భద్రతతో ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

- మందమర్రి జీఎం మనోహర్
- మంజీరా షావెల్ ప్రారంభం

రామకృష్ణాపూర్, అక్టోబర్ 16 : భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్ పేర్కొన్నారు. ఆర్కేపీ ఓసీపీలో సోమవారం మంజీరా షావెల్ (ఎస్‌ఏఎన్‌వై ఎస్‌వై210సీ-9)ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. యంత్రం విలువ రూ.48,17,733 ఉంటుందన్నారు. భద్రతా జాగ్రత్తలతో మిషిన్‌ను సక్రమంగా నిర్వహించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపీఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఇంజినీర్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మిట్టపోశం, ఆంజనేయులు, బేస్ వర్క్‌షాప్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మంజీరా షావెల్ యత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

## షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

రామకృష్ణాపూర్, అక్టోబర్ 16 : క్యాతనపల్లి మున్సిపాలిటీ 2వ వార్డు జ్యోతినగర్‌కు చెందిన బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి వెంటనే మందమర్రి మండల తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ రాజశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ జయకృష్ణకు సమాచారం అందించారు. బాధితుల వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయాన్ని కౌన్సిలర్ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందించాలని పంపించారు. ఘటనా స్థలాన్ని పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, చైర్ పర్సన్ కళ పరిశీలించారు. అనంతరం విప్ సుమన్ పంపిన నగదును బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు జాడి శ్రీనివాస్, పోగుల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ పుల్లూరి కల్యాణ్, గడ్డం రాజు, వేముల వెంకటేశం, ఓదెల సతీశ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.